"ఈ మూడు గదులకీ మూడు వందలివ్వ డానికి—చేరి ఇంకా పూర్తిగా ఏడాది కాలేదు. వందరూపా యలు పెంచాల్ట అద్దె" ఇంటామె మీద విసుక్కుంది రమ.

"ఏడాదికో మారిచ్చే ఇంక్రిమెంట్ ఈవిడే వుచ్చేసు కుందామనుకుంటోందేమో! ఏదైనా సరే—ఖాళీ అయినా చేస్తాం కాని పైసా పెంచేది లేదు అద్దె" గట్టిగానే అంది రమ.

ఇవతల వాటాలో మాటలు ఇంటామె కామాక్షమ్మ చెవిలో పడనే పడ్డాయి. గబ గబా అటు నుంచి తిరిగి ఇవతల వాటాలోకి వచ్చి, "ఆ... ఆ... ఏడాది నాడు నా తెలివి తక్కువ కొద్దీ ఇచ్చాను ఇల్లు" అంది చేతులు తిప్పుతూ.

"అదేవిటీ అలా మాట్లాడతారు? గంటన్నర ఇంట ర్వ్యూ చేసి కదా ఇచ్చింది ఇల్లు?"—కంటికొన నుంచి నిర్లక్ష్యంగా చూసి మళ్ళీ తన పనిలో నిమగ్నమైంది రమ.

వ్యక్తుల మనస్తత్వాలు, ఆ మనస్తత్వాల ధోరణికి అనుగుణంగా వుండే అనుబంధాలు చిత్రంగా వుంటాయి. కొందరి విషయంలో ఒకే తరహా మనస్తత్వం గలవారి మధ్య సఖ్యత ఏర్పడుతుంది. మరి కొందరి విషయంలో ఒకరి భావాలు మరొకరికి పడకపోయినా, అప్పుడప్పుడు పేచీలు పడుతు న్నా వారి మధ్య స్నేహభావం నెలకొంటుంది. అటువంటి అనుబంధాల దృఢత్వం విడిపోతున్న ప్పుడు మరింత స్పష్టమౌతుంది!


"ఒక్కసారిగా వందరూపాయలు పెంచాలంటే మాటలా? ఇప్పటికే మూడు వందలిస్తున్నాం. అదే కష్టంగా ఉంది. జీతంలో కొంత ముసలి అత్తగారికి మావగారికి పంపాలా? పిల్లల కాన్వెంట్ జీతాలు, వెచ్చాల కొట్లో బాకీలు, మధ్య మధ్య చుట్టాలు, వెళ్లి రావలసిన పెళ్లిళ్లూ పేరంటాలూ-ఏ నెల జీతం ఆ నెల సరిపడ్డమే కష్టంగా ఉంది" అంది రమ బేలగా స్వగతం చెప్పుకున్నట్లు.

కామాక్షమ్మ రమ దగ్గరగా వచ్చి" అమ్మా! మీ జీతం సంగతి నాకెందుకు? అన్ని ఖరీదులూ పెరిగాయి. వాటితో పాటే ఇళ్లద్దెలు కూడా" అంది.

"పెరిగాయి కాదండీ! పెరుగుతున్నాయి. పెరుగు తూనే ఉన్నాయి అనాలి" అంది రమ ఆవేశంగా.

"ఏవమ్మోయ్ రమా! నువ్వు మా యింట్లోకి వచ్చినప్పు డు ఇలా లేవు. నిన్ను నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఎలా మాట్లాడావు, ఇప్పుడెలా మాట్లాడుతున్నావు? ఏమైనా సరే, అద్దె పెంచకపోతే ఇల్లు ఖాళీ చెయ్యాల్సి ఉంటుంది. ఈ మాటే చెప్పదలచుకున్నాను ఆనక ఆఫీసునుంచి మీ ఆయన రఘురాం వచ్చాక" అంది కామాక్షమ్మ అధికార స్వరంతో.

"ఆయన ఆఫీసుకీ పిల్లల స్కూలుకీ దగ్గరని మీ



# మనస్తత్వాలు

— పోలాప్రగడ రాజ్యలక్ష్మి

ఇంట్లో ఆవేళ చేరాం అద్దె ఎక్కువయినా ఆలోచించకుండా. పని మనిషిని మానిపించాను, చాకల్ని మానిపించాను. అన్ని పనులూ నేనే చేసుకుంటున్నాను. అయినా కష్టంగానే ఉంది. మీ ధర్మమా అని ఇంట్లోకి ఒక కొత్త సరుకు అమర్చు కోలేదు ఏడాదయి'' రమ గొంతులో బాధ పెల్లుబికింది.

''అదంతా నాకు తెలియదమ్మా-అలా నువ్వు బాధపడితే సరిపోదు. అద్దె పెంచడం సంగతి ఆలోచించు. అయినా నీ సంగతి ఏం అర్థంకాదు. నువ్వు మా యింట్లోకి వచ్చిన తర్వాత ఒక్క రోజున నాతో సరదాగా మాట్లాడ్డం కాని ఒక్క సాయం చెయ్యడం కాని ఏమైనా చేశావా? ఇది వరకు ఈ వాటాలో ఉండి వెళ్లిన అమ్మాయి అలా కాదు. రోజూ నాకు పేపరు చదివి వినిపించేది. పాటలు పాడి వినిపించేది. మొగుడు ఏమైనా అంటే, నాతో కష్టం సుఖం చెప్పుకొనేది. అతనికి తెలియకుండా నా దగ్గర డబ్బులు దాచుకొనేది''

కామాక్షమ్మ కేసి రమ తీక్షణంగా చూసింది.

కామాక్షమ్మ ఇంకా చెప్పుకుపోతూనే ఉంది.

''అతను మాత్రం? నేను వంటరి మనిషినని, సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చాక ఇలా వంటింటి గడప మీద కూచుని, నేనలా తులసి కోట దగ్గర వత్తులు చేసుకుంటూంటే, ఆఫీసు కబుర్లూ ఇంటి ఖర్చులూ, ఒకటేమిటి అన్ని సంగతులూ ఒక్కటీ దాపరికం లేకుండా చెప్పేవాడు. ఏవిటో! వాళ్లు వెళ్లాక ఆ సందడే పోయింది... ప్చ్...'' అంటూ నిట్టూర్చింది కామాక్షమ్మ.

రమకి వళ్లు మండుకొచ్చింది.

''ఏమిటో పిన్నిగారూ! ఇది వరకు మేం ఉన్న ఇంటామె నన్ను తన బిడ్డలా చూసుకొనేది. ఇలా మినప్పప్పు నానబోస్తే అలా వచ్చి రుబ్బి పెట్టేది. మీరు వట్టి కబుర్లు తప్ప పని సాయం ఏమీ లేదు'' అంది మెత్తగా చెబుతున్నా ఆ మాటల్లో ఎంతో వ్యంగ్యాన్ని దట్టిస్తూ.

''ఆ... ఆ... ఎంత మాట అన్నావు?... నేను... నేను... నీకు... మినప్పప్పు రుబ్బి పెట్టాలా? పెద్ద దాన్నని గౌరవం అయినా లేకుండా ఎంతలేసి మాటలంటున్నావు... హమ్మా... హమ్మా'' అంటూ గబ గబా అక్కడ నుంచి వెళ్లిపోయింది కామాక్షమ్మ.

రమకి కోపంతో వళ్లు ఊగిపోతోంది. ఆవేశం అదుపులో పెట్టుకోవడం కష్టంగా ఉంది. ఏడాది నుంచి చూస్తోంది. ఎంత ఓర్పుగా ఉందామన్నా రోజు రోజుకీ ఈమె ధోరణి మితి మీరిపోతోంది. ఏం బాగాలేదు. ఆలోచనలతో అలసిపోయి వాలుకుర్చీలో వాలిపోయింది రమ.

గడిచిపోయిన రోజులూ, పాత సంగతులూ అన్నీ జ్ఞాపకం రాసాగాయి.

సరిగ్గా ఏడాది క్రితం ఈ ఇంట్లోకి అద్దెకి రావడం కోసం తను ఎంత అవస్థపడిందో గుర్తుకు రాసాగింది.

ఎన్నో ఇళ్లు చూశారు తనూ రఘురాం. ప్రతి అద్దె ఇంటికీ ఏదో ఒక ఇబ్బంది ఉంది. ఆఖరికి పిల్లల స్కూలుకీ ఇటు రఘురాం ఆఫీసుకీ దగ్గరగా ఉంటుందని ఆలోచించి ఈ ఇంట్లో ఉండడానికి నిర్ణయించుకున్నారు. తాము నిర్ణయించుకుంటే అయిందా? ఈ కామాక్షమ్మ ఇల్లు అద్దెకి ఇవ్వబోయే ముందు ఓ కఠినమైన ఇంటర్వ్యూ పెట్టింది. ఆ ఇంటర్వ్యూలో తను చచ్చీ చెడి నెగ్గింది.

బి.యే. పాస్ అయిననాటి ఆనందం కంటే, రఘురాంతో తన పెళ్లి నిర్ణయం అయిందన్న రోజు సంతోషం కంటే, ఈ అద్దె ఇల్లు దొరికిందన్న ఆనందమే గొప్పగా కనిపించింది.

''ఏలూరు పట్టణంలో అద్దెకి ఇల్లు సంపాదించడం కోసం శ్రీమతి రమాదేవిగారు పడ్డపాట్లు!'' అంటూ రఘురాం నవ్వి ''ఏదీ... ఏదీ... ఇంటామెతో నీ ఇంటర్వ్యూ విశేషాలు... ఒక్క మాటు చెప్పవేయ్!'' అని అప్పుడప్పుడు అడగడం తను సరదాగా చెప్పడం అలవాటు.

''నీ పేరేమిటమ్మా?'' ఆఫీసరు హోదాలో కామాక్షమ్మ వేసిన ప్రశ్న.

వినయంగా ''నా పేరు రమ అంటారండి'' తన జవాబు.

''ఆహా... ఎంత వినయం!'' అంటూ తెగ సంబరపడిపోయి, ''ఏం చదివావు?'' అని మరో ప్రశ్న.

ఏం చదివానంటే ఏం గొడవో భగవంతుడా అనుకొని 'ఏదో కొద్దిపాటి చదువులెండి' అంది.

''ఆడపిల్లకి అంతకంటే చదువెందుకు చాల్లెద్దూ—మా తాతగారు అనేవారు 'వంటపనీ ఇంటిపనీ తెలియాలి కాని ఆడపిల్లలకి చదువు లెందుకు పనిలేకపోతేనూ? చదువుకుంటే ప్రేమ లేఖలు రాస్తారు ప్రాణాలు తీస్తారు' అని—'' చాలా గొప్పగా అన్నాననుకొని తన మాటలకి తనే నవ్వుకుంది కామాక్షమ్మ.

''కాని విద్యలేనివారు వింత పశువు'' అంటారు కదండీ!'' అంది తను.

కామాక్షమ్మ తబ్బిబ్బుపడి, ''ఆ... అదేదో సందర్భంలో అని ఉంటారులే!... అది సరే... నీకు సంగీతం వచ్చా?'' అని కళ్లు ఎగరేస్తూ మరీ అడిగింది.

చచ్చాంరా దేవుడా! వచ్చునంటే అస్తమానూ పాటలు పాడతావు కాబోలు. ఇల్లు ఇవ్వను అంటుందేమో! రాదంటే, ఏ పాటా పద్యంరాని గోడవి. నీకిల్లు ఇచ్చేదేవిటి పొమ్మంటుందేమో! ఏవిటి చెయ్యడం? సందిగ్ధంలో పడింది తను.

అయినా ఆవిడ ముఖకవళికలు ఎలా ఉన్నాయో చూసి, వాటిని బట్టి సమాధానం చెబుదాం అని కామాక్షమ్మ కేసి చూసింది.

''పోనీ—మామూలు పాటలయినా రావూ?'' అంది మాటని సాగదీస్తూ కామాక్షమ్మ.

దాంతో కంగారుపడి, ''ఆ... ఆ... నాకు సంగీతం రాకేమండీ! కీర్తనల వరకూ నేర్చుకున్నాను'' అంది.

''అహ! బాగుంది. ఎప్పుడైనా ఓ కీర్తన వినిపిస్తావన్న మాట. సరే పద. మీకు అద్దెకిచ్చే వాటా ఇప్పుడు చూపిస్తాను'' అంది.

ఆవిడా, ఆవిడ వెనకాల తనూ బయలుదేరింది.

మళ్లీ ఇంతలోనే వెనక్కి తిరిగి, 'హ...' అంటూ ఏదో తేలు కుట్టినట్లు అరిచింది కామాక్షమ్మ.

'మళ్లీ ఏం అడుగుతుందిరా భగవంతుడా' అనుకుంది రమ.

''నీకు దేముడూ, పూజా, వీటి మీద నమ్మకం ఉందా? మీవారు ఆఫీసు నుంచి తిన్నగా ఇంటికి వస్తారా? మీ పిల్లలు బుద్ధిమంతులేనా? అల్లరి చేయరుకదా! మీ యింటికి చుట్టాలూ స్నేహితులూ ఎక్కువగా వస్తే నాకు కిట్టదు. రేడియో నెమ్మదిగా పెట్టుకోవాలి. నాకసలే గుండెదడ...'' ఇలా కామాక్షమ్మ తన షరతుల జాబితాని చదువుతూంటే అన్నింటికీ తల ఒగ్గి దేనికీ సమాధానం చెప్పలేక వినయంగా తల మాత్రం ఊపింది. అన్నింటికీ ఉమ్మడిగా ఒకే సమాధానం అన్నట్లు, తర్వాత ఎదురుగుండా ఉన్న దేముడి ఫోటోకి మాత్రం చేతులెత్తి ''ఆపద్బాంధవా!'' అంటూ నమస్కరించింది.

అది చూసి కామాక్షమ్మ ఆనందంతో 'దైవభక్తి చాలా ఉందన్నమాట నీకు?'' అని వీపు మీద చెయ్యివేసి నిమిరింది. తర్వాత నవ్వుతూ సమన్లు జారీచేసే జడ్జ్ లాగ ''ఊ... ఈ మారు పిలు నీ భర్తనీ పిల్లల్నీ-ఇల్లు చూస్తారు'' అంది.

వస్తూన్న కోపం ఆపుకోవడం కష్టం అయింది రమకి. ఈ పరిస్థితిలో ఈ ఇంట్లో జేరితే రోజుకో కొత్త సమస్య పుట్టుకొస్తుందేమోనని భయపడింది. సరే ఇంతవరకూ వచ్చాక వెను దిరగడం ఎందుకు? మరీ అంత పద్మవ్యూహంలోకి వెళుతోందా ఏమైనానా?

తనలో తను నవ్వుకొని ''ఉండండి పిన్నిగారూ! మావార్నీ పిల్లల్నీ పిలుచుకు వస్తాను'' అంది. అని అరుగు మీదకి వచ్చింది.

ఆషాఢ మాసం అయినా ఇంకా వేడి గాలువు వీస్తోందేమో, కుర్చీలో కూర్చున్న రఘురాం, ప్రక్కనే కూర్చున్న పిల్లలూ, ఎండదెబ్బకి తోటకూర కాడల్లా వాలిపోయి ఉన్నారు. వాళ్లనా స్థితిలో చూసే సరికి రమకు చాలా బాధకలిగింది.

టైమ్ చూస్తే మూడయింది.

అంటే కామాక్షమ్మ తనని రెండు గంటలు ఇంటర్వ్యూచేసిందన్నమాట!

'ఈ అద్దె ఇంటి అగచాట్లు పగవాళ్లకి కూడా వద్దు మహాప్రభో' అనుకుంది రమ.

"అమ్మా! మంచి నీళ్లే!" అంటూ పిల్లలిద్దరూ, జాలి గొలి పేలాగ చేత్తో సంజ్ఞ చేస్తూ మరి అడిగారు నీరసంగా.

రమ మనసు చివుక్కుమంది.

రఘురాం రమకేసి కోపంగా చూసి "మమ్మల్ని కూడా ఇంటర్వ్యూ చేస్తానంటోందా?" అనడిగాడు ఎర్రబడ్డ కళ్లతో.

వెనకాలే వచ్చి ఆ మాటలు విన్న కామాక్షమ్మ హుందాగా నవ్వుతూ" అబ్బే-మీకు అక్కర్లేదు ఇంటర్వ్యూ. ఎక్కువ టైము ఇంట్లో ఉండేది ఇల్లాలే కనుక ఆమెకే!" అంది.

తర్వాత రామభక్తుడైన హనుమంతునిలావంగి దోసిలొగ్గి నమస్కరిస్తూ "అయితే చాలా సంతోషం. ఇహ మీరు అద్దె సెలవిస్తే..." అన్నాడు రఘురాం వినయంగా.

భక్తుని ఆశీర్వదించబోయి ఆగిపోయిన భగవంతుని పోజులో నిలబడిపోయి పక్కకి తిరిగి "ఏవిటీ? చిన్న పిల్లలు మీరు కూడా దణ్ణం పెడుతున్నారా?" అంటూ కామాక్షమ్మ పిల్లల్ని చూసి ముసి ముసి నవ్వులు నవ్వింది.

"ఇంతకీ అద్దె సెలవిచ్చారు కాదు" అంటూ పెట్టిన దణ్ణం తియ్యకుండా ఆ మట్టున అలాగే నిలబడి అడిగాడు రఘురాం.

భర్తని ఆ స్థితిలో చూస్తే రమకి గుండె తరుక్కుపోయింది.

రఘురాం మాటకి సమాధానంగా కామాక్షమ్మ "అబ్బే—ఎంతేనా? మూడువందలు. అద్దైనా మీ దంపతుల్ని చూస్తే ముచ్చటగా ఉండి ఇల్లు ఇస్తున్నాను" అంది తన మంచితనాన్ని ప్రకటిస్తూ.

రఘురాం రమ కళ్లల్లోకి చూశాడు.

"ఈ ఇంటికి ఇంత అద్దా?" అన్న ఆశ్చర్యంతో బాటు, "ఇంత అద్దె భరించగలమా?" అన్న భయం కూడా ఉంది ఆ చూపులో.

"సరే తర్వాత సంగతులు తర్వాత చూసుకుందాం. ముందు ఓ గూడు అంటూ ఒకటి దొరికిందిగా? ఆలోచించకండి" అన్నట్లుగా రమ భర్తకేసి చూసింది.

ఎవరు ఎవరికేసి ఎలా చూశారో, ఎవరి చూపులో ఏ భాష ఉందో, అసలు ఆ కళ్లభాష ఏమిటో ఇవేవీ పట్టలేదు కామాక్షమ్మకి.

"తను అనుకుంటున్న అద్దె వస్తోంది" అన్న ఆనందంలో ఉంది. పిల్లలిద్దరూ మౌనంగా ఇల్లంతా కళ్లతో కలయజూశారు. అంతా కొత్తగా ఉంది వాళ్లకి. సరే ఇంట్లోకి ప్రవేశించేదాకా ఒక ప్రకరణం, ఆ తర్వాత మరో ప్రకరణం.

ఇల్లు దగ్గరకావడంవల్ల పిల్లలు ఒంటిగంటకి అన్నాలకి వస్తారు. రఘురాం కూడా కాఫీకి వస్తాడు. ప్రొద్దుట వెళ్ళిన వాళ్లు సాయంత్రం దాకా కంటికి కనిపించరు అనడం కంటే మధ్యలో ఇలా మధ్యాహ్నం భర్తా పిల్లలూ ఓమారు ఇంటికి వచ్చి వెళ్లడం బాగానే ఉంది రమకి.

బాగుండనిదల్లా తనమీద పడిన భారమే!

గిన్నెలు కడగడానికి బట్టలు ఉతకడానికీ ఇంత క్రితం పని వాళ్లని పెట్టుకునేది. ఈ ఇంట్లోకి వచ్చాక వాళ్లని మానిపించేసి ఆ పనులు తనే చేసుకోసాగింది. లేకపోతే నెలజీతం సరిపోదు. మూడు వందలు ఇంటద్దే పోతుంది కదా! రోజంతా యంత్రంలా పనిజేసి అలసిపోతోంది. ఈ పనుల బాధ్యతల వల్ల అసలు తను బి.యే పాసయ్యాను అన్న సంగతే మరిచిపోయింది రమ. సరదాగా తనకాలేజీ జీవితం, ఫ్రెండ్సూ, కబుర్లూ, చిన్నప్పుడు అమ్మ చేతి మీదుగా తిన్న కమ్మని భోజనం, ఇవేవీ జ్ఞాపకం తెచ్చుకొనేందుకు తీరికే ఉండడం లేదు, సరికదా ఓ కూనిరాగం తీసుకోవడానికి కూడా వీలులేకపోతోంది.

## కీర్తి - అపకీర్తి

మొట్టమొదటిసారిగా స్విమ్మింగ్ సూట్ ధరించిన కీర్తి అన్నెట్ కెల్లర్‌మన్ అనే అమెరికన్ వనితకి 1909లో లభించింది. ఆమె ధరించిన స్విమ్మింగ్ సూట్ మోకాలు భాగం దాటి 50 సెం. మీ. భుజాలు దాటి 50 సెం. మీ. వున్నా అసభ్యంగా దుస్తులు ధరించి శరీరభాగాలని ప్రదర్శించిందనే కారణంగా అన్నెట్ కెల్లర్‌మన్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. అలా కీర్తితోపాటు అపకీర్తి కూడా ఆమె మూటకట్టుకుంది!

—కె. వేణి

సన్నగా నెమ్మదిగా పాడితే "కొంచెం గట్టిగా పాడు. ఏం? నీ పాట నేను వినకూడదా?" అనీ, నిజంగా గట్టిగా పాడితే "ఏవమ్మోయ్... ఏవిటా పాటలు... అసలే నాకు గుండె దడకూడాను" అనీ, ఇలా ఎలా పాడినా కామాక్షమ్మ సాధింపు తప్పడం లేదు రమకి.

సాధింపు సరే.

ఎప్పుడైనా సరదాగా కొత్త చీర ఏదైనా కట్టుకుందో వెంటనే కామాక్షమ్మ కళ్లు వచ్చి పడతాయి. కళ్లు అంత లేసి చేసి ఆశ్చర్యంగా చూస్తూ దవళ్లు నొక్కుకుంటూ "ఉహూ! కొత్తచీర! మా యింట్లోకి వచ్చాక మీ ఆయన సంపాదన బాగాపెరిగిందన్నమాట! కొత్త చీరలూ పోకులూ—రోజు రోజుకీ చిన్న పిల్లవి అయిపోతున్నావు?" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పడం.

ఓ రకం భయం బయలు దేరింది రమకి కామాక్షమ్మ అంటే—

అది గమనించిన పిల్లలు "అదేవిటమ్మా! నాన్నకేనా భయపడవు. ఇంటామెకి అలా భయపడతావేమిటి?" అని నిలదీసి అడుగుతున్నారు. ఊరుకోండర్రా అంటే "ఏం భయపడకు. మనం అద్దె యిస్తున్నాం కదా!" అని అరుస్తారు కామాక్షమ్మ వినేలాగ.

నాలుగు రోజుల క్రితం కరివేప చెట్టు దగ్గరికి వెళ్లి "ఉప్మాలోకి రెండు రెమ్మలు కోసుకోనా పిన్నిగారూ!" అని అడిగింది తను.

"ఆ... ఏవిటీ? కరివేపాకు కావాలా? వీధిలోకి వస్తుంది కొనుక్కో—చెట్టు మీద చెయ్యి వెయ్యకు—చెట్టు అమ్మేశాను" అంది కామాక్షమ్మ కఠినంగా.

ఆ మాటలకి తప్పుచేసిన దానిలా తను సిగ్గుపడింది. కాని ఎక్కడ నుంచి విన్నారో పిల్లలిద్దరూ రయ్‌మంటూ అక్కడికి వచ్చి "మరి రోజూ ప్రొద్దుటే పేపరు రాగానే మీ రెండుకు తీసుకుని చదువుతారు మాకంటే ముందు? కొనుక్కోలేరూ?" అని ముదలకించారు.

వాళ్ల ప్రశ్నకి కాస్సేపు ఉక్కిరి బిక్కిరై "ఏవమ్మోయ్ రమా! నీ పిల్లలిద్దరూ చూడు. పెద్దదాన్ని అనే గౌరవమైనా లేకుండా ఎలా మాట్లాడుతున్నారో!" అంటూ కోపంగా వాళ్లకేసి చూసింది కామాక్షమ్మ.

"బాబూ! మీరలా మాట్లాడకూడదు. బుద్ధిగా చదువుకోండి వెళ్లి" అంటూ గెడ్డం పట్టుకుని పిల్లల్ని బ్రతిమాలింది తను.

తనకేసి జాలిగానూ, ఇంటామెకేసి కోపంగానూ చూసి "ఇంకోమారు మా అమ్మని ఏదైనా అన్నారో మేం వూరుకోం" అని కుడి చేతి చూపుడు వేలు చూపించి ఆమెని బెదిరించి మరీ కదిలారు పిల్లలిద్దరూ అక్కడి నుంచి.

ఇలా జరిగిన సంగతులన్నీ తలచుకుంటూ అద్దె పెంచడమా, ఇల్లు ఖాళీ చేసి మరో ఇల్లు చూసుకోవడమా? ఏవిటి చెయ్యడం? ఎటూ పాలుపోక తీవ్రంగా రమ ఆలోచిస్తూన్న సమయంలో రఘురాం నవ్వుతూ ఆఫీసు నుంచి వచ్చాడు.

అతనికి ఎదురు వెళ్లి "ఏమిటి సంగతులు? నవ్వుతూ వస్తున్నారేవిటి?" అంటూ చిరునవ్వుతో పలకరించింది రమ.

"మనకి ప్రమోషన్ వచ్చింది. విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేశారు" అంటూ రఘురాం ఆర్డరు కాగితం ఆమె చేతిలో ఉంచాడు.

సంతోషంతో "నిజంగా?" అంటూ ఒక్కకేక వేసి గబగబా చదివి "హమ్మయ్య! అయితే ఇంటావిడతో నాకు ఇబ్బంది తప్పిందన్నమాట!" అంది రమ

ఆనందంగా.

ఆ సాయంత్రం బజారుకి వెళుతూ "ఏం కావాలి?" అని అడిగాడు రఘురాం.

"మల్లెపూలు" అందీ రమ.

"అవి మాత్రం మరిచిపోవు ఇద్దరు పిల్లల తల్లివి అయినా"—ఛలోక్తిగా అన్నాడు రఘురాం.

"ఏం చెయ్యను మరి! ఇన్నేళ్లు కాపురం చేసినా చెప్తేకాని తెలియదాయె ఏం తేవాలో"

ఇలా మాటల్ని పూల చెండుల్లా విసురుకుంటూ ఆ దంపతులిద్దరూ నవ్వుకుంటున్న సమయంలో కామాక్షమ్మ వాళ్ల వాటాలోకి వచ్చింది—ఇంటద్దె పెంచాలని రఘురాంకి చెప్పడానికి.

అది గమనించిన రమ రఘురాం ఇద్దరూ "రండి రండి" అని ఆవిడని ఆప్యాయంగా ఆహ్వానించి, ట్రాన్స్‌ఫర్ సంగతి చెప్పి "ఈ నెలాఖరుకి మేం ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతాం విజయవాడ" అన్నారు.

ఆ మాటలు విని గతుక్కుమని "ఆ... ఏవిటి? నిజంగా? నిజంగానేనా?" అని కంగారుపడుతూన్న కామాక్షమ్మకి, ఇంగ్లీషులో ఉన్న ఆర్డరు కాగితం చదివి తెలుగులో చెప్పింది రమ, గర్వంగా—రఘురాం ఓ ప్రక్క నిలబడి కాలరు సర్దుకుంటుండగా.

"ఆహా! నిజమేనన్నమాట!" ఈ మాటలంటూన్నప్పుడు కామాక్షమ్మ గొంతు గద్గదికం తేయింది.

తర్వాత కళ్లల్లో కనిపించిన కన్నీటి తెరని పైట చెంగు చివరతో అద్దుకుని "ఏవిటో! ఏడాది నుంచి తల్లీ పిల్లల్లా ఉంటున్నాం. మళ్ళీ ఈ వాటాలోకి ఎలాంటి వాళ్ళు వస్తారో!" అంది దిగులుగా.

అంతే!

ఆమె కళ్ళు తడికావడం చూసేసరికి రమ, రఘురాం గుండెలు కూడా జాలితో నిండిపోయాయి.

"అలా బాధపడకండి పిన్నిగారూ! మిమ్మల్ని ఈ యింటినీ వదిలి వెళ్ళాలంటే మాకూ ఏదోలా ఉంది. ఏడాది నుంచి అలవాటు పడిపోయాం" అన్నారు.

అంతలోనే కామాక్షమ్మ కాస్త గర్వం తెచ్చుకుని "అవున్లే—మళ్ళీ మీకు అక్కడ మా యిల్లులాంటి ఇల్లుదొరకొద్దూ?" అంది.

"అంతేనండి-మాకూ మంచి ఇల్లు దొరకాలి. మీకూ మంచి వాళ్లు అద్దెకి రావాలి" అంది రమ.

"మంచితనం ఉంటే అంతా మంచిగానే ఉంటుందమ్మా!" అంది కామాక్షమ్మ గతాన్నంతా మరిచిపోయి.

"నిజానికి కామాక్షమ్మగారు మంచిదే! ఏదో మనుష్యులన్నాక మాటా మాటా వస్తే మాత్రం?" అనుకుంది రమ.

వాళ్ల మనస్తత్వాలు అర్థం కాక ఇద్దర్నీ చూసి వేదాంతిలా నవ్వుకున్నాడు రఘురాం. □



## ఆకాశవాణి గాయని,
## దూరదర్శన్ కళాకారిణి—
## కుమారి జి. అలకనంద

"పప్పా పాట పాడనా, మమ్మీ మాటాడనా" అనే పాట శ్రావ్యంగా ఇప్పటికీ హైదరాబాదు ఆకాశవాణి నుండి ప్రసారమయ్యే "బాలానందం" పిల్లల కార్యక్రమంలో వినబడుతూంటుంది. ఆ సుమధురమైన గొంతు కుమారి జి. అలకనందది. ఈమె ప్రస్తుతం హైదరాబాద్‌లో హోమ్‌సైన్స్ విద్యార్థిని. తన 9వ యేట 'బాలానందం' పిల్లల కార్యక్రమంలో పాల్గొనటానికి వెళ్ళిన అలకనంద 'బాలానందం' కార్యక్రమానికి రెగ్యులర్ గాయనిగా నియమించబడింది. అలకనంద "వంశీ ఆర్ట్ థియేటర్స్"వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 'లలితసంగీతం' పోటీల్లో వరుసగా 3 సంవత్సరాలు ప్రథమ బహుమతి పొంది, "పెండ్యాల నాగేశ్వరరావు" రోలింగ్ షీల్డ్‌ను శాశ్వతంగా కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడెమీ వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన లలితసంగీతం పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతులు, లియోక్లబ్ ఆఫ్ హైదరాబాద్‌లో నిర్వహించబడిన సంగీత పోటీల్లో అనేక సార్లు స్కూల్, కాలేజ్ స్థాయిలో అనేక బహుమతులూ పొందారు.

సంగీతంలోనే కాక నాట్యరంగంలో కూడా ఈమె ప్రఖ్యాతి గాంచారు. ఆమె 8వ ఏట హైదరాబాదులోని 'రవీంద్ర భారతి'లో 'రంగప్రవేశం' చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆమె ఆంధ్ర ఆంధ్రేతరరాష్ట్రాల్లో నూరుకు పైగా సోలో నృత్యప్రదర్శన లిచ్చారు. సోలో ప్రదర్శనలే కాక అనేక నృత్య నాటికల్లో కథానాయిక పాత్రలు ధరించారు. 1986లో హైదరాబాద్‌లో దేశంలోనే ప్రప్రథమంగా జరిగిన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ విశ్వవిద్యాలయాల ఎన్. ఎస్. ఎస్. యూత్ ఫెస్టివల్" సందర్భంగా జరిగిన సోలో నాట్యపోటీల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ తరఫున పాల్గొని ద్వితీయ బహుమతి పొందారు కుమారి అలకనంద. ఇంతవరకు ఆమె నృత్య పోటీల్లో దాదాపు 75కి పైగా బహుమతులు పొందారు. హైదరాబాద్ 'దూరదర్శన్' కేంద్రంలో ఈమెవి ఇప్పటికి 15 డాన్స్ రికార్డింగ్స్ ఉన్నాయి.

సంగీత, నాట్యరంగాల్లో ప్రావీణ్యం గడిస్తూనే, చదువులో ప్రతి సంవత్సరం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలవటం కుమారి నంద అకుంఠితపటిమ, కార్యదీక్షలకు నిదర్శనం.

—టి. ఎ. జ్యోతి సలోమి